
అనువాదకథ



# అడ్డుగోడలు

మలయాళ మూలం : కమలాదాస్

తెలుగుసేత : ఎల్. ఆర్. స్వామి

**"ఈ రోజు వాటాదారుల మీటింగ్ ఉంది. రావటం ఆలస్యమవుతుంది" ఆఫీసుకు కారెక్కుతూ అన్నాడు అతడు.**

**అతని మాటలు ఎవరూ పట్టించుకోలేదు. ఎవరైనా పట్టించుకుంటారని అతడు అనుకోనూ లేదు. చెప్పటం అలవాటు కనుక, చెప్పాడు అంతే! కారెక్కి కూర్చున్నాక ఒకసారి వెనక్కు తిరిగి ఇంటివైపు చూసాడు. భార్య, చిన్నమ్మాయి పాపకి గోరులు కత్తిరిస్తోంది. అమ్మాయి తోటలో పని చేసే మాలిపై అరుస్తోంది. పెద్దకోడలు ఇంటి మెట్లపై కూర్చుని సినిమా పత్రిక తిరగేస్తోంది. రెండో కొడుకు రేడియోలో, ప్రసారమయే క్రికెట్టు మ్యాచు ప్రత్యక్ష ప్రసారం వింటున్నాడు. ఏ ఒకరు అతని వైపు చూడలేదు.**

ఒక సిగరెట్టు వెలిగించి, వెనుక సీటులో జారబడి తన కుటుంబం గురించి ఆలోచించాడు, అతడు. అందరు, తనకి దూరంగా వున్నారా, వుంటే, దానికి కారణం ఏమిటనేది, అతని ఆలోచన. అప్పుడప్పుడు, వాళ్ళమధ్య కూర్చున్నప్పుడు, వాళ్ళ మధ్య వుండాలని అనిపించదు, అతనికి- దారి తప్పి అక్కడ చేరిన అనుభూతి కలుగుతుంది.

"పెరుగు మరీ పుల్లగా వుందా?" ఆ లావుపాటి ఆవిడ అప్పుడప్పుడు, అడుగుతుంది, భోజనం చేసేటప్పుడు. ఫానుగాలికి నెరిసిన ఆవిడ జుట్టు కదులుతూ వుంటుంది, అప్పుడు. మొగ గొంతుతో చిన్నమ్మాయి వంటమనిషిని తిడుతూ వుంటుంది. "నీకెన్నిసార్లు చెప్పాలి కూరలో వెల్లుల్లి వెయ్యవద్దని".

భోజనం బల్ల చివర కూర్చునే ఉంగరాల జుట్టబ్బాయి అరుస్తాడు "మంచినీళ్ళు పొయ్యండి".

బల్ల ఇవతల కూర్చునే నాజూకమ్మాయి పాలీష్ పులుముకున్న వేళ్ళతో, కోడిపిట్టలా అన్నం ఏరుకు తింటూ వుంటుంది.

అతనికి ఒంటరితనం అనిపిస్తుంది. వాళ్ళ మధ్య బల్ల చివర కూర్చున్నందుకు చింతిస్తాడు. ఊపిరి ఆడనట్టు తోస్తుంది. ఏదో సమన్వయ లోపం పికాసో గీసిన రేఖల నేపథ్యంలో, అందమైన రవివర్మ చిత్రాన్ని నిలబెట్టినట్లు అనిపిస్తుంది. ఆ పెద్దావిడ మళ్ళీ అడుగుతుంది "పెరుగు మరీ పుల్లగా వుందా...?'

"ఊ..." మూలుగుతాడు. మాట్లాడకుండా వుండటమే మంచిదని అనుకుంటాడు. అది అతని కుటుంబం- తను బ్రతికి సాధించినది- బ్రతుకు ఇచ్చిన బహుమతి-సంవత్సరాలు గడిచినకొద్ది, ఎత్తు కత్తిరించి నగిషీలు చెక్కి పోల్చుకోలేనంతగా, కొత్తగా తయారుచేసిన కుటుంబం- ఆ కుటుంబం గురించి గొప్పగా తోచాలి కదూ! కాని ఈ మధ్య ఎందుకో, కుటుంబం గురించిన ఆలోచనల రంగు వెలసిపోయినట్టు...

కుటుంబం పట్ల అభిమానం తగ్గినా, తన కుటుంబమే కదా, అనుకుంటాడు. తెల్ల పట్టుచీర కట్టి రవ్వల కమ్మలు వేసుకొని, తన పిల్లలతోనూ, మనవళ్ళతోనూ అప్పుడప్పుడు పరభాషలో మాట్లాడే ఆ మధ్య వయస్కురాలు, గత ముప్పది సంవత్సరాలలో ఇంటా, బయటా మారిపోయింది; కాని, తనతో ఏడడుగులు వేసిన మాధవియే! ఇప్పుడు అదెందుకు, అతనికి గుర్తు రావటం లేదు? గుర్తుంది- ఆ రోజులు- మాధవితో ఏడడుగులు వేసినరోజు- తొలి రోజుల్లోని ప్రతి చిన్న మాట చేత. జీవితంలో ఎదగటానికి తాపత్రయబడే ఒక చిన్నవాడి ఆశలు, ప్రయత్నాలు- అతని భార్య చిన్న చిన్న కోరికలు... అన్ని గుర్తే...!

"వీడికి భాస్కర్ అని పేరు పెడదాం... ఏమంటారు...?" దూలానికి కట్టిన గుడ్డ ఊయల ఊపుతూ మాధవి అడిగింది.

"వద్దు, వద్దు... అదేంపేరు...? మనోహర్ అయితే బాగుంటుంది".

"ఏంటీ...?"

"మనోహర్'.

ఒక నిమిషం మాట్లాడలేదు, మాధవి. ఆ తరువాత అంది "అదీ మంచి పేరే..."

సుమారు ముప్పది సంవత్సరాల క్రితం జరిగింది ఇది. అయినా ఈరోజే జరిగినట్టు అనిపిస్తుంది అతనికి.

"లిల్లీ మనోహర్ ఇంకా రాలేదా? టైం తొమ్మిది అవుతోంది".

"లేదండి..."

"లేటు వస్తాడని చెప్పాడా...?"

"చెప్పలేదు, మామయ్యగారు..."

"ఊ..." గట్టిగా మూలిగాడు అతడు.

కొన్ని రోజులుగా, వారంలో నాలుగైదు రోజులైనా ఆలస్యంగానే ఇంటికి వస్తున్నాడు, మనోహర్. వాడు సేల్స్ మేనేజర్ అయినప్పటి నుంచి ప్రారంభమైంది, లేటు రావటం. మేనేజర్‌గా ప్రమోషన్ అందుకున్న మొదటి సంవత్సరంలోనే, వాడు పని చేసే సంస్థ ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుపోవటం వల్ల, ఎందరో ఉద్యోగాలు కోల్పోయారు. సంస్థ నిలకడ కోసం మిగిలిన ఉద్యోగులకు జీతబత్యాలు తగ్గించవలసి వచ్చింది. ఇండియాలో, కార్మికులని ఎక్కువగా బుజ్జగిస్తున్నారని చెప్పాడు, మనోహర్. నిజం చెప్పాలంటే అతని నమ్మకం కూడా అదే. కాని ఆ మాటలు యువకుడైన మనోహర్ నోటినుంచి రావటం అతనికి బాధ కలిగించింది. పెట్టుబడి పెట్టేవారి మనస్తత్వం మనోహర్‌కి, ఆ వయస్సులో రాకూడదనేది అతని ఉద్దేశ్యం. పెద్దవారికి వస్తే పర్వాలేదు. ఎందుకంటే వారు త్వరగా కనుమరుగవుతారు. కాని మనోహర్ అలాంటి యువకులని ఈదేశం ఎలా భరిస్తుంది!

కారు ఆగింది. అప్పుడు తెలిసింది అతనికి, వాన పడుతున్నట్టు. గొడుగుతో కారు వద్దకు వచ్చాడు, బంట్రోతు. ముప్పది సంవత్సరాలుగా పనిచేసే ఆ బహుళ అంతస్తుల భవనంలోకి, తల దించుకొని అడుగు పెట్టాడు, అతడు.

ఒకసారి చుట్టూ చూసాడు. హాలులో, ఉద్యోగులు ఎవరూ కనబడలేదు. గుమాస్తా సుబ్బయ్య మాత్రం ఒక మూలలో వున్న తన సీటులో కూర్చుని ఏదో రాస్తున్నాడు. అతడు తరువాత, ఆ బ్యాంకులో అత్యధిక కాలం పని చేసినవాడు, సుబ్బయ్యే! ఒకప్పుడు, సుబ్బయ్య పక్క సీటే అతనిది. అప్పుడు సుబ్బయ్యని "బావా" అని పిలిచేవాడు. మెలమెల్లగా, హాలు దాటి కేబిన్‌లోకి ఎదిగిపోయాడు అతడు. అప్పటినుంచి ఆ పిలుపూ ఎగిరిపోయింది. కష్టపడి పని చెయ్యటం వల్లనూ, అదృష్టం కొంత కలసిరావటం వల్లనూ బ్యాంకుకు జనరల్ మేనేజర్ అయ్యాడు. కాని, ఏ ఎదుగుదల లేక పెద్దగా పెరగని జీతంతో బ్రతుకు ఈడ్చే సుబ్బయ్యని చూస్తే బాధ కలిగేది, అతనికి. ఉతికి ఉతికి చిరిగిపోయిన ఖద్దర్ బట్టలతో అదే సీటులో అలాగే తల వంచి పని చేసే సుబ్బయ్యకి ఏదైనా మేలు చెయ్యాలని, అప్పుడప్పుడు అనిపించేది. కాని లాభం లేకపోయింది. సుబ్బయ్య పనితనం తక్కువ స్థాయిలోనే వుండేది. అటు ఇటూ చూడకుండా ఇనుము చట్రంలో నుంచి దూకే కుక్కలా, అదే పని అలాగే చేసుకుంటూ, అలాగే అదే కుర్చీకి అతక్కుపోయాడు సుబ్బయ్య. చాకులాంటి కుర్రాళ్ళు బ్యాంకులో చేరి, సుబ్బయ్యని దాటి మేనేజర్లు అయ్యారు. సుబ్బయ్యకి సహాయం చెయ్యటం గురించే ఆలోచించేవాడు అతడు. సొంత ఊరువాడైనంత మాత్రాన, ఒకప్పుడు "బావా", అని పిలిచినవాడైనంత మాత్రాన...

కేబిన్‌లోకి అడుగు పెట్టాడు అతడు. కోటు తీసి, తన సీటువెనుక గోడకి తగిలించాడు. బల్ల మీద దినపత్రికలు వరుసగా పేర్చి వున్నాయి. ప్రధాన వార్తలు- ముఖ్యంగా బ్యాంకులకు సంబంధించినవి- ఎర్ర సిరాతో 'మార్కు' చేసి వున్నాయి. ఆ పని అసిస్టెంటు మేనేజర్ రామచంద్రది. ఈ మధ్యనే ప్రమోషన్ అందుకొని ఈ పదవికి వచ్చాడు. బాగా చిన్నవాడైనా ఆ పదవికి అర్హుడు. కష్టపడి పని చేస్తాడు. ఎల్లప్పుడూ, చిరునవ్వు చిందించే ముఖము- ఎంత విసుగు వచ్చినా, బయట కనబడనివ్వడు- బ్యాంకుకు ఆశీర్వాదం. కాని రామచంద్ర కేబిన్‌లోకి అడుగుపెట్టినా, ఆత్మవిశ్వాసం నిండిన అతని మాటలు విన్నా, ఏదో తెలియని అస్వస్థత... తెలియని భయం...

కిటికి రెక్కల మీద వాన చినుకులు పడే సవ్వడి. విని తిరిగి చూసాడు. తెరిచివున్న కిటికిలో నుంచి వచ్చే గాలిఈల హఠాత్తుగా, మనస్సుని ఒక పల్లెకి తీసుకొని వెళ్ళింది- సంవత్సరాల క్రితం మాట-

"ఒరేయ్, రాంబాబూ... ఏంటిరా అలా చూస్తూ నిలబడ్డావు? పుస్తకం తీసి చదువు..."

"రాంబాబూ...!" అది చాలా పాత పిలుపు. వానకి పూర్తిగా కారే పెంకుటింటిలో వున్నప్పటి పిలుపు! ఎక్కడకి వెళ్ళినా, ఆ పిలుపు, ఇప్పుడు వినబడదు. హఠాత్తుగా తలుపు తీసి లోనికి వచ్చాడు రామచంద్ర.

"మన్నించండి, సార్" రామచంద్ర అన్నాడు. "ఒకటి, రెండు విషయాలు చెప్పాలి".

"ఊ...... మీటింగ్‌కు సంబంధించినవేనా...?"

మీటింగ్‌కు సంబంధించిన విషయాలేనట! గత వారం బ్యాంకుని అప్పు అడిగిన ఇనుము కంపెనీ సరైన ఆర్థిక నేపథ్యం లేనివారు ప్రారంభించినదట. ఆ కంపెనీ మునిగే స్థితిలో వుందట. వివరాలన్ని సేకరించాడు అతడు. అప్పు ఇవ్వకూడదనేది అతని అభిప్రాయం.

"సరే... గుర్తుంచుకుంటాను... ఇంకా..."

చెప్పవలసినవి చాలా వున్నాయట! ప్రమోషన్ లిస్టు చదివి వినిపించాలట! అందులో మార్పులు- చేర్పులు ఉండవని అతని నమ్మకం. అయినా...

"లిస్టు చదువు..."

అతడు చదివాడు. సుబ్బయ్య పేరు లేదు.

"సుబ్బయ్యని కూడా లిస్టులో కలుపు..."

"సుబ్బయ్యే... ఆ ముసలోడా...!" రామచంద్రకి ఆశ్చర్యం వేసింది. "ఏ పని సరిగా చెయ్యడు..."

సుబ్బయ్యకి ప్రమోషన్ ఇవ్వొద్దనేది రామచంద్ర అభిప్రాయం. అతన్ని రాజీనామా చేసి వెళ్ళమని చెప్తే బాగుంటుందట!



"కుదరదు" అతడు గట్టిగా అన్నాడు. "ఈసారి సుబ్బయ్యకి ప్రమోషన్ రావాలి".

"అలాగే సార్" తల దించుకొని వెళ్ళిపోయాడు, రామచంద్ర.

మళ్ళీ ఆలోచనలలో పడ్డాడు అతడు. వాటాదారుల మీటింగ్ ముందు, లాభనష్టాలు లెక్కవేస్తున్నట్టు ఇన్నేళ్ళ జీవితంలోని లాభనష్టాలు లెక్కలో మునిగాడు ఏమో వయస్సు పెరిగినందువల్లనేమో, రంగు వెలిసిన గత జీవితం నుంచి కొంత ఆనందాన్ని పిండి ఆరగించటం ఈ మధ్య అలవాటైంది అతనికి. చిన్నప్పుడు ఇంత సుఖంగా లేదు కదా!

కాలం పరుగు తీస్తూ వుంటే దుఃఖపు రంగు వెలిసిపోతుంది. సుఖమే జ్ఞాపకంలో వుంటుంది. చెయ్యలేకపోయిన మేలు, చేసిన తప్పులు హృదయాన్ని వేధిస్తాయి. ఎక్కడ తప్పు జరిగిందనే ఆలోచనలో పడ్డాడు. ఎంతో సంపాదించినా, ఎంతో సుఖంగా వున్నా, ఎందుకు ఈ అసంతృప్తి?

మనిషి, ఎప్పుడూ ఒంటరివాడే! తనకు సొంతమైన వలయంలోనే వుంటాడు. తాను ఒంటరివాడనే ఆలోచన ప్రతి ఒకరిని వేధిస్తుంది. మానవుల మధ్య ఎల్లప్పుడూ, చిన్న చిన్న అడ్డుగోడలు లేస్తూనే వుంటాయి. వాటిని కూల్చడానికి, స్నేహబాటలో అడుగులు వెయ్యటానికి, జీవిత లక్ష్యమైన ఆనంద సాధనకి దారులు నిర్మించుకోవాలి. ఎవరి సమస్యని వారే పరిష్కరించుకోవాలి. ఆరోజు రాత్రి నిద్ర పోయేముందు, అతడు అన్నాడు

"మాధవీ... నేను ఉద్యోగం మానేయాలని అనుకుంటున్నా..."

"ఏమైంది...?" ఆమె కంగారుపడింది.

"మనం పెద్దవారమైనాం కదా... ఊరు వెళ్ళి అక్కడే వుండాలని..."

మాధవి ఏమి అనలేదు. గాలికి కిటికి రెక్కలు గట్టిగా కొట్టుకున్నాయి.

•